మరో మజిలీ

"మొకం నూసి రోగవేటో సెప్పాల. ఏటనుకున్నావ్! వాతగునవా? వాయుగునవా? జలదోసవా? గాలి సోకింది? దిస్టిదోసవా? సేతబడి సేసేరా? పసరు మందేయాలా? కసాయం ఇయ్యాల? మంతరం ఏయాల? తావీదు సుట్టాలా? గాపోతే దిగదుడుపెట్టాలో కానుకోవాల!"

"అంతేగాని నోట్ల గాజు పుల్లెట్టి సెయ్యట్టుగోందే రోగవుందో నేదో సెప్పనేవు గదా! మరి నువు మా గేమాల్ల వైద్దెవేటి సేస్తవ్ కుర్రడాక్టరూ!"

"ఎలచ్చన్ల టయాంల గవన్నెంటోల్లు వోట్లగోసం గేమంల అసుపత్తిరి గట్టించీనారు. మరి ఈవోరకూ డజనుమంది డాక్టరుబాబుల్ని తోలినారు. ఎవరూ గేమంల మూడు పొద్దులుండనేదు. కారనవేటి?"

"మీరంతా పట్టనంల పుట్టి పెరిగినోరు. పెదపెద్ద సదువులు సదివినోరు. గేమాల్ల ఏటినొల్లుకోవాల? ఏటుందని? ఓ ఇనోదవా? ఇగ్గేనవా? సినేమాల? సికార్లా? ఏడసూసినా పశూల రొచ్చులు, పెంటగుప్పలు, మట్టివోసన!"

"సూడు బాబూ! నువ్వా సిన్నోడివి! సదువుకున్నోడివి. పొట్ట సేతబట్టుకుని మాకాడకొచ్చినావు. గాదనను. అంచాతనానోటి సెవతాను ఇనుకో. నువు అసుపత్తిరిల నీడ పట్టున కూకో! నీకాడకొచ్చినోల్లకి నువు వైద్దెం సెయ్యి! రంగునీల్లు యివ్వు. గోలీలు ఇవ్వు. గాదనను. డుబ్ డుబ్ బండేసుకు ఊర్ల కొంపలంట దిరిగితే నాను పల్లకోను" కొత్తగా వచ్చిన డాక్టరు ప్రతాప్‌ని హడలకొట్టాడు మంత్రాల మరిడయ్య.

మంత్రాల మరిడయ్య రెండు తాటిదుంగల మీద తారుడబ్బా నిలేసి దానిమీద కుండ బోర్లించినట్లుంటాడు. కావిరంగు పంచ, బానలాంటి పొట్ట చుట్టూఅరచేతి వెడల్పు తోలుపటకా, మెడలో పూసల దండలు, నుదుట రూపాయి కాసంత

సింధూరం బొట్టు, దండలకి తావీదులు, గిరజాల జుట్టు, ఎఱ్ఱటి నిప్పుకణాల్లాంటి కళ్ళు.

చుట్టుప్రక్కల పది గ్రామాలకి మరిడయ్యే వైద్యుడు. మనుష్యులకే కాదు, పశువులకు, పక్షులకు కూడా వైద్యంచేస్తాడు.

మరిడయ్యదంతా వింత వైద్యం. చిన్న చిన్నరోగాలకు సైతం పూనకం వెయ్యందే మందివ్వడు. పెద్ద జబ్బులకైతే రోగి నివసించే గ్రామ దేవత పూనకం, సాధారణ రోగాలకు మామూలు పూనకం వేసి ఆకుపసర్లు, మంత్రించిన విభూది, తావీదు, దిగదుడుపు లాంటివి రోగి ఆర్థిక పరిస్థితిని బట్టి నిర్ణయించి ఇచ్చి డబ్బు వసూలు చేస్తాడు. వాడు చేసిందే వైద్యం. ఇచ్చిందే మందు, ప్రజలకు మరో దారి లేక వాడి

మీదే ఆధారపడ్డారు.

గ్రామీణులకు వారి గ్రామదేవత అసిరమ్మ, బంగారమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, గొట్టాలమ్మ మొదలైన వాటిమీద ఎనలేని నమ్మకం. ఏటా గ్రామదేవత జాతర ఘనంగా జరిపిస్తారు. ఆ దేవత కరుణవల్ల వర్షాలు సకాలంలో కురుస్తాయని పిల్లాపాపలు ఆరోగ్యంగా వుంటారని, వారి పశువులకు, పక్షులకు రోగాలు రావని, పంటలకు చీడ పీడలు సోకవని వారి నమ్మిక. వారి మూఢనమ్మకాలను సొమ్ము చేసుకోవడమే మరిడయ్యలాంటి వారిపని.

ప్రతి సంవత్సరం గ్రామదేవత జాతర జరపవలసిన తేదీ, టైమ్ మరిడయ్య ఆ గ్రామపెద్దలముందు పూనకం వేసి తెలియజేస్తాడు. అందుకుగాను రైతులు ఇంటికి పుట్టెడు వడ్లు మరిడయ్యకు ఏటా ముట్టచెప్తారు. మరిడయ్య పూనకంలో సూచించిన విధంగా తమ గ్రామదేవత పండుగ జరిపిస్తారు. ఇతర ఖర్చులు గ్రామస్థులు చందాలు వేసుకుని భరిస్తారు. జాతర మరిడయ్య చేతుల మీదనే జరుగుతుంది.

నాలుగు గ్రామాల కూడలిలో మూడేళ్ళ క్రితం ప్రభుత్వం వారు ఆసుపత్రి కట్టించారు. అందువల్ల చుట్టుప్రక్కల కూతవేటు దూరంలో వున్న సుమారు పది గ్రామ ప్రజలకు వైద్య సదుపాయం అందుతుందనే నమ్మకంతో.

అయితే తనకు రాబడి పోతుందని, ప్రజలలో తనకున్న పలుకుబడికి నష్టం వస్తుందనే భయంతో మరిడయ్య వచ్చిన ప్రతి గవర్నమెంట్ ఆసుపత్రి డాక్టర్ని హడలుకొట్టి తరిమేస్తున్నాడు. సాధారణంగా పట్నవాసులు గ్రామరాజకీయాల్లో తల దూర్చరు. సాధ్యమైనంతవరకూ దూరంగా వుంటారు.

ఆసుపత్రిలో అడుగుపెట్టిన ప్రతి డాక్టర్నీ వెళ్ళగొట్టడమే గాక మరిడయ్య గ్రామ ప్రజలందర్నీ భయపెట్టి వార్నింగ్ ఇచ్చాడు. మందు కోసం ఎవరూ ఆసుపత్రికి వెళ్ళకూడదని, డాక్టర్ని ఇంటికి రప్పించుకోవడం చేయకూడదని, అతనిచ్చిన మందుబిళ్ళలు వాడకూడదని, కాదు లేదని మొండికేసినవారు ఫలితం తప్పక అనుభవిస్తారని, అప్పుడు వారిని ఇక మరి ఎవరూ కాపాడలేరని మరిడయ్య తన శిష్యుల ద్వారా ప్రచారం చేయించాడు.

ఈ పర్యాయం వచ్చిన డాక్టర్ ప్రతాప్‌ని కూడా మరిడయ్య హడలగొట్టేసాడు. నామాట వినకపోతే ఫలితం అనుభవిస్తావని వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు.

మరిడయ్య వార్నింగ్ మౌనంగా విన్నాడు ప్రతాప్. అతడు వెళ్ళినవేపే చూస్తూ కూర్చునేసరికి ఇద్దరు వ్యక్తులు హడావుడిగా వచ్చారు.

"ఏటి భావూ! ఆ మరడయ్య గోడు అలా సిందులు దొక్కుత ఎల్లిపోతున్నాడు. ఆడు తవకాడకి కాని వచ్చినాడేటి? ఆడితో ఇరోదం ఎట్టుకోకండి భావు. ఆడసలే మంచోడుగాడు" అన్నారు సానుభూతి ప్రదర్శిస్తూ.

"అలాగా ఏం చేస్తాడు?"

"ఆడు సెయ్యనేని పనిలేదండి. ఆడుగాని సేతబడి సేసేడంటే దానికి తిరుగునేదండి. దాని ఇరుగుడు గోసం సివరాకరికి ఆడి కాల్లే వొట్టుగోవాల. తవరు ఊరుకి కొత్తోరు. పసివోరు. తవకి ఆడి సంగతి తెలవదు" అని ఇంకా ఏమో చెప్పబోయారు. అంతలో రామనాధం మాస్టారు రావడంతో వారు మెల్లగా జారుకున్నారు.

రామనాధంగారు ఆ గ్రామం ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టర్. వయస్సు ఏభై సంవత్సరాల కంటే పైనే వుంటుంది. అతనిని చూడగానే గౌరవభావం కలగుతుంది.

"నమస్కారం డాక్టరుగారూ" అన్నారు.

"అయ్యయ్యో పెద్దవారు మీరు నాకు నమస్కరించడమేంటి? రండి ఇలా కూర్చోండి" అన్నాడు ప్రతాప్.

"ఏం పెద్దరికం బాబూ! బడిపంతుల్ని. ఆ మరిడయ్య అతడి మనుష్యులు వచ్చి నిన్ను కూడాభయపెట్టి వెళ్ళారా?" అన్నాడు రామనాధంగారు పేలవంగా నవ్వి.

"హెచ్చరించారు" అన్నాడు ప్రతాప్ చిరునవ్వు నవ్వి.

"అంతే బాబూ! వారి ఆగడాలకు అంతులేదు. గొర్రె కసాయివాడినే నమ్ముతుంది. ఏం చేయగలం? ఈ చుట్టుప్రక్కల గ్రామప్రజలందరూ చదువురాని అమాయకులు. వీరికి మూఢవిశ్వాసాలు, గుడ్డినమ్మకాలు ఎక్కువ. సరిదిద్దడం సాధ్యపడదు." అన్నారు నిట్టూర్చి.

"మీరేమీ వర్రీ అవకండి. మాస్టారూ! సరైన ప్రయత్నం చేస్తే సాధించలేనిదేదీ ఉండదు అని నా నమ్మకం" అన్నాడు ప్రతాప్.

"ఏమైనా నువ్వు కాస్త జాగ్రత్తగా వ్యవహరించు బాబూ!"

రామనాథంగారిని పరీక్షించి మందిచ్చి పంపించేసాడు.

డాక్టర్ ప్రతాప్ మంచి సోషల్ వర్కర్. గొప్ప ధైర్యవంతుడు. అంతేకాదు. అతని తండ్రి విజయ్‌కుమార్ డి.ఐ.జి.

ఆరోజు సాయంత్రం ప్రతాప్ పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ పెద్దిరెడ్డిని కలిసి మాట్లాడాడు. పెద్దిరెడ్డి టెన్త్‌వరకూ చదువుకున్నాడు. గ్రామ ప్రజల మంచి కొరకు, బాగుకోసం పాటుపడే మనిషి.

పెద్దిరెడ్డి ప్రతాప్‌కి అన్నివిధాలా సహకరిస్తానని భరోసా ఇచ్చాడు.

డాక్టర్ ప్రతాప్ పెద్దిరెడ్డిని వెంట తీసుకుని వెళ్లి చుట్టు ప్రక్కల వారి పరిధిలో వున్న గ్రామాలన్నీ పరిశీలించి వచ్చాడు. ప్రజలు నివసించే ఇళ్ళు, వాటి పరిసరాలు, త్రాగునీటి సదుపాయాలు, వనరులు, ప్రజల అలవాట్లు పూర్తిగా అవగాహన చేసుకున్నాడు.

ఓరోజు పెద్దిరెడ్డి తన ఇంటికి గ్రామప్రజలు ఆడ, మొగ అందర్నీ రమ్మనమని కబురు పంపించాడు. అందరూ వచ్చి కూర్చున్న తరువాత వారికి డాక్టర్ ప్రతాప్‌ని పరిచయం చేసాడు.

డాక్టర్ ప్రతాప్ తన పోర్టబుల్ ప్రొజెక్టర్ సహాయంతో వారికి ఆరోగ్య సూత్రాలకు సంబంధించిన ఫిల్మ్‌లు చూపించాడు.

ప్రజలు ఇంటి పరిసరాలలో పెంటకుప్పలు, చెత్త, మురుగునీరు నిలువుండకుండా ఎలా శుభ్రపరచుకోవాలో, అలా చేయకుంటే వాటిపై ఈగలు చేరి అవి రోగక్రిములని ఏ విధంగా చేరవేస్తాయో, వాటివల్ల ఎటువంటి జబ్బులు వచ్చి అవి ఎలా వ్యాప్తి చెందుతాయో ఫిల్మ్ చూపించి వాటి గురించి వివరంగా చెప్పాడు.

దోమలవల్ల మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చి అవి ఇతరులకు ఎలా సోకుతాయో, అవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మరొక ఫిల్మ్ చూపించాడు.

త్రాగేనీరు శుభ్రంగా లేకుంటే అందువల్ల వచ్చే రకరకాలు జబ్బులు, అవి రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, వచ్చిన తరువాత నివారణ కొరకు వాడవలసిన మందులు మొదలైన విషయాలు ఫిల్మ్ చూపించి చెప్పాడు.

ప్రతాప్ చెప్పిన విషయాలన్నీ అందరికీ చక్కగా అర్థమయ్యాయి. వాటిని అమలు చేస్తామని చెప్పారు.

అదే సమయంలో పెద్దిరెడ్డి కొడుకు అంజిరెడ్డి పదేళ్ళవాడు తండ్రి వద్దకు వచ్చి 'పట్నం వెళ్ళిసినిమా చూసి రావడానికి పాతిక రూపాయలు ఇమ్మ'ని అడిగాడు.,

అంజిరెడ్డి చురుకైనవాడు. ఐదవతరగతి చదువుతున్నాడు. అప్పుడప్పుడు స్నేహితులతో కలసి పట్నం వెళ్ళి సినిమా చూసి రావడం వాడికి అలవాటే. పెద్దిరెడ్డి ఆరోప్రాణం అంజిరెడ్డి. కొడుకు మాట ఎప్పుడూ కాదనడు. వాడు ఏది అడిగితే అది ఇస్తాడు. అయితే ఆ రోజు వాడు అలా మర్యాద లేకుండా గ్రామస్థులు అందరి ఎదుట అడగటం పెద్దిరెడ్డికి ఏ మాత్రం నచ్చలేదు.

'ఇప్పుడు కాదు రేపు పంపిస్తాను' అని ఎంతో సౌమ్యంగా నచ్చచెప్పాడు. అంజిరెడ్డి వినలేదు. డబ్బు వెంటనే కావాలని మంకుపట్టుపట్టాడు. దాంతోపెద్దిరెడ్డికి కోపం వచ్చి డబ్బులివ్వనని కొడుకుని కసిరాడు.

తండ్రి తన మాట కాదన్నాడని అంజిరెడ్డికి రోషం వచ్చింది.

"నాకు వెంటనే డబ్బు ఇవ్వు. నేకుంటే నీకు నాను సేతబడి సేస్తాను" అని బెదిరించాడు.

వాడి బెదిరింపుకు పెద్దిరెడ్డితోపాటు అక్కడున్న గ్రామ ప్రజలు బిగ్గరగా నవ్వారు.

"గొట్టికాయంతనేవు గుంటడివి. నన్ను అదలిత్తావురా. సెయ్యిరా సెయ్యి" అన్నాడు.

తండ్రి మాటలకు వాడికి పౌరుషం వచ్చింది. విసురుగా పెరట్లోకి వెళ్ళి అందరూ చూస్తుండగా చెట్టునుంచి రెండు నిమ్మపళ్ళు కోసుకుని వచ్చాడు. అందులో ఒకటి పిడికిట వుంచి దానిమీద నోటితో గాలి మూడుసార్లు ఊది తండ్రి ముందు నిల్చుని గాల్లో దానిని ముమ్మారు సవ్యంగా త్రిప్పాడు. వాడి చర్యలు అందరూ ఎంతో కుతూహలంగా చూస్తున్నారు.

"నీకు సేతబడి సేసేను" అన్నాడు వాడు గంభీరంగా ఫోజుపెట్టి.

"పోరా నీ మాటెవడు నమ్ముతాడు?" అన్నాడు హేళనగా.

"నువ్వు అట్టాగంటావని ఎరికే. మీ కాడ ఎవురి దగ్గరేనా కత్తి, సాకు వుందా?" అన్నాడు.

డాక్టర్ ప్రతాప్ ఫోల్డింగ్ నైఫ్‌తీసి వాడికిచ్చాడు.

అంజిరెడ్డి తన పిడికిట్లో వున్న నిమ్మకాయను కోయబోయాడు.

"బాబూ! సాకు పదునుగా వుంటాది. సెయ్యి గోసుకోగలవు" అన్నాడు అంజిరెడ్డి మేనమామ గంగిరెడ్డి.

వాడు వినిపించుకోక ప్రయత్నించాడు. కానీ సాధ్యపడలేదు. గంగిరెడ్డి చప్పున వాడి వద్దకు వెళ్ళి "ఇటుదే నాను గోసి పెడతాను" అని వాడి చేతిలోని నిమ్మపండు, చాకు తీసుకుని మెల్లగా రెండు ముక్కలు మధ్యకి కోసాడు. అందులోనుండి ఎర్రటి ద్రవం కారింది. గంగిరెడ్డి వాటిని క్రింద జారవిడిచాడు.

పెద్దిరెడ్డితోపాటు అక్కడవున్న వారంతా కెవ్వుమన్నారు.

ఆడవాళ్లంతా హడలిపోయారు.

"తిరుగునేదు ఇది సేతబడి లచ్చనమే" అని నిర్ధారించారు.

పెద్దిరెడ్డికి ముచ్చెమటలు పట్టాయి. కర్చీఫ్ తీసి చెమటలని తుడుచుకో బోయాడు. చేతులు వణికి కర్చీఫ్ జారి కిందపడింది. అతడు ముందుకు వంగి దానిని అందుకోబోయాడు. అంతలోనే అది అందరూ చూస్తుండగానే భగ్గున మండి బూడిద అయింది.

ఆ దృశ్యం చూసిన తరువాత ఎవరికీ నోటంట మాట రాలేదు. ముమ్మాటికీ అది చేతబడి అని అందరూ ఒప్పుకున్నారు.

విరుగుడు చేయమని అంజిరెడ్డిని వేడుకున్నారు.

"అరేయ్! ఇయిగోరా డబ్బులు. పాతిక కాదు యాభై దీసుకుని తొరగా ఇరుగుడెట్టరా" అన్నాడు పెద్దిరెడ్డి దీనంగా.

"అట్టారా దారికి. నాతో పెట్టుగోకు" అని తండ్రి చేతిలోని ఏభై రూపాయల నోటు అందుకుని దానిని నిక్కరు జేబులో పెట్టుకున్నాడు.

అంజిరెడ్డి రెండో నిమ్మపండు తీసి చేత్తో పట్టుకుని దాని మీద నోటితో

ముమ్మారు గాలి ఊది దానిని తండ్రి చుట్టూ ముమ్మారు అపసవ్యంగా రివర్స్‌లో గాలలిలో త్రిప్పి దానిని కోసి చూడమన్నాడు.

గంగిరెడ్డి దానిని మధ్యకు కోసాడు. అది మామూలు గానే ఉంది. అందరూ సంతోషంతో ఊపిరి పీల్చుకున్నారు.

"మీరందరూ నా బొట్టిడు అంజిరెడ్డి బెమ్మాండంగా సేతబడి సెయ్యిగల్డు.దానికి ఇరుగుడు ఎట్టగలడు" అని ఒప్పుకుంతన్నారా అన్నాడు పెద్దిరెడ్డి.

"మావుకల్లారా సూసింది కాదనగలవేటండీ. నిజివే ఒప్పుకుంతన్నావు అన్నారు నమ్మకంగా.

పెద్దిరెడ్డి, డాక్టర్ ప్రతాప్, అంజిరెడ్డి వెంటనే పక్కున నవ్వారు.

"మీరంతా ఎంత అమాయకులో, మీలో వున్న మూఢనమ్మకం ఎంత బలమైందో మీకు తెలియజేయడానికే ఈ చిన్న నాటకం ఈ కుర్రాడి చేత ఆడించి మీకు చూపించాను."

"వెరీగుడ్ అంజిరెడ్డి. నేను చెప్పినట్లు ఎంతో చక్కగా యాక్ట్ చేసావు. అందరినీ హడలుగొట్టించావు. నీ యాక్టింగ్‌కి మెచ్చుకుని నీకు నేను ఈ పెన్ బహుమతిగా ఇస్తున్నాను" అని ప్రతాప్ అంజిరెడ్డికి పెన్ను ఇచ్చాడు.

వాడు సంతోషంగా దానిని అందుకుని తల్లిదండ్రులకు, అక్కడున్న వారందరికీ దాన్ని చూపించాడు.

"సూడండి. మనవందరం ఎంత తెలివిమాలినోల్లవో, మన్ది ఎంత గుడ్డి ఇసవాసవో మన కల్లముందే ఇప్పుదీసిసూపించేరు డాట్టరు భావు. బొడ్డూడని గుంటడు సేతబడి సెయ్యడవేటి, దానికిరుగుడెట్టవేటని ఒక్కరుకూడా వోదన సెయ్యనేదు. నిజివే అని వొంత పాడినారు. ఈతూరి ఆడు మీకాడకొచ్చి జరావొరిసేస్తే ఆడికి కూడా సొమ్ము సేతిల ఎట్టి దండ వెడతారా?" అన్నాడు పెద్దిరెడ్డి.

గ్రామవన్ధలకిదంతా అయెామయంగా వుంది. కళ్లతో చూసింది కాదనలేకపోతున్నారు.

"చూడండి మంత్రాలు, చేతబడులు అనేవి లేవు. అవన్నీ మీ మూఢ నమ్మకాలు మాత్రమే. మీ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మిమ్మల్ని భయపెట్టి నమ్మించి

మీ దగ్గర డబ్బు వసూలు చేస్తున్నారు మంత్రగాళ్ళు. చూడండి ఈ నిమ్మపండు కోస్తే అందులోనుంచి ఎర్రటి ద్రవం వచ్చింది. దానిని చూసి మీరు నెత్తురనుకుని భయపడ్డారు. నిజానికది నెత్తురుకాదు. నా చాకుకి ఈ ఆకుపసరు పూసాను. దానితో నిమ్మపండు కోస్తే ఇలా ఎర్రగా రసాయన ప్రక్రియ చెందుతుంది. ఇక రెండోది క్రిందపడ్డ పెద్దిరెడ్డిగారి చేతిరుమాలు భగ్గున మండడం. భాస్వరం గాలిలో ఉంచితే అది ఈ విధంగా వెంటనే మండుతుంది" అని అన్నీ వారికి వివరంగా చెప్పి చేసి చూపించాడు. తరువాత అదే విషయం ఫిల్మ్ వేసి చూపించాడు.

దాంతో వారంతా తమ అమాయకత్వానికి, గుడ్డి నమ్మకానికి ఎంతో సిగ్గుపడ్డారు.

"మంత్రాలు, తంత్రాలు, చేతబడులూ అంతా బూటకమే! అవన్నీ పొట్టకూటికోసం సోమరిపోతులు ఆడే నాటకాలు. అమాయకులని హడలుకొట్టించి సొమ్ము చేసుకోవడమే మంత్రగాళ్ల పని! వీటికి సంబంధించిన మరికొన్ని వివరాలు, ఫిల్మ్‌లు మీకు నేను చూపిస్తాను" అని చెప్పేడు ప్రతాప్.

ప్రతాప్ మాటల్లో గ్రామప్రజలకు ఎంతో గురికుదిరింది. ఇప్పుడు వారిలో ఎంతో చైతన్యం వచ్చింది. అతడు సూచించిన ఆరోగ్య సూత్రాలన్నీ చక్కగా పాటిస్తున్నారు. వారికి కావలసిన సదుపాయాలన్నీ పెద్దిరెడ్డి సమకూరుస్తున్నాడు.

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు, పనుల ఒత్తిడి, యాంగ్జయిటీ మొదలైన వాటివల్ల పేద, మధ్య తరగతి కుటుంబీకులు వారికి తెలియకుండానే హిస్టీరియా అనే మానసిక రోగానికి గురవుతుంటారు. ఇది ముఖ్యంగా ఆడవారిలో ఎక్కువగా వుంటుంది.

"హిస్టీరియాకు గురైనవారి ప్రవర్తన ఎంతో విపరీతంగా వుంటుంది. దానిని మనవారు చూసి 'చేతబడి' అని భయపడతారు. భయం వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయి. మానసిక రోగాలు వస్తాయి. ఈ మానసిక రోగాలు-హిస్టీరియా ఎన్నో రకాలు- సాధారణంగా ఇష్టంలేని పనులు ఎవరూ చెయ్యరు. తప్పించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. అటువంటప్పుడు మనస్సు, మెదడు బలహీనపడి తప్పించుకోవాలనుకునే పని, చేయవలసిన అవయవాలు తాత్కాలికంగా చచ్చుపడిపోతాయి. వాటిలో చలనం వుండదు. భయం వల్ల వచ్చే ఈ జబ్బును 'కన్‌వర్షన్ సిండ్రోమ్' టెంపరరీ పక్షవాతం అంటారు. అలాగే కొందరికి సడన్‌గా మాట

పడిపోతుంది. ఇటువంటి జబ్బుని 'అఫోనియా' అంటారు. మరికొందరు తమకు నచ్చని వాతావరణం, ప్రదేశాలనుండి బయటపడి దూరంగా పోవాలని తాపత్రయపడి వింతగా ప్రవర్తిస్తారు. అమాయక ప్రజలలోగల మూఢవిశ్వాసాల వల్ల ఇవన్నీ 'చేతబడి' వల్ల వచ్చినవేనని నమ్మి మంత్రగాళ్లను ఆశ్రయిస్తారు. అంతేకాని మానసిక వైద్యులకు చూపించరు" అని చెప్పి వాటికి సంబంధించిన ఫిల్ములు చూపించి వారి అనుమానాలు తీర్చేడు ప్రతాప్.

పట్నం నుండి పశువుల డాక్టర్ని రప్పించి పశువులకు, పక్షులకు సాధారణంగా వచ్చే రకరకాల జబ్బులు, వాటి నివారణ కోసం వాడవలసిన మందులు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వారికి చెప్పించేడు. అంతేకాదు పంటలకు పట్టే రకరకాల చీడలు, వాటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు గురించి వివరాలు వారికి చెప్పించి చైతన్యవంతుల్ని చేసేడు డాక్టర్ ప్రతాప్.

గ్రామస్తులంతా ఇప్పుడు ప్రతాప్‌ని తమ పాలిట దైవంగా భావిస్తున్నారు. అతని సూచనలు పాటిస్తున్నారు. ఏమాత్రం నలతగా వున్నా అశ్రద్ధ చేయకుండా అతనిని సంప్రదించి మందులు వాడుతున్నారు. ఆరోగ్య సూత్రాలు చక్కగా పాటిస్తున్నారు. తమ పశువుల్ని, పక్షుల్ని పశువైద్యుడికి చూపించి వాటికి అవసరమైన చికిత్స చేయిస్తున్నారు.

మరిడయ్య వద్దకు ఎవ్వరూ వెళ్లడంలేదు. అతడి మంత్రతంత్రాలు, తావీదులు ఎవ్వరూ నమ్మడం లేదు. అతడి పూనకం ఎవరూ పట్టించుకోవడంలేదు. అతడు ఇన్నాళ్ళూ ఏ విధంగా తమని భయపెట్టి మోసం చేసి డబ్బులు తీసుకున్నాడో గ్రామస్థులు తెలుసుకున్నారు. వాడిని, వాడి శిష్యులను గ్రామంలో తిరగనివ్వడంలేదు. ఇప్పుడు మరిడయ్య ఆదాయం పూర్తిగా పడిపోయింది. దీనికంతకూ కారణం ఆ కుర్రడాక్టరేనని అతనిమీద చాలా కోపం వచ్చింది మరిడయ్యకు. అతనిని మాటలతో బెదిరించి లాభం లేదనుకున్నాడు. ఓ రోజో రాత్రి కాపుకాసి ఒంటరిగా వస్తున్న డాక్టర్ ప్రతాప్‌ని తలపై కర్రతో కొట్టాడు మరిడయ్య.

ప్రతాప్ తలకి గాయమైంది. అటుగా వస్తున్న ప్రజలు ఈ దృశ్యం చూసి మరిడయ్యను వెంటతరిమారు. వాడు చీకట్లో ఎటో తప్పించుకున్నాడు. వారు డాక్టర్ ప్రతాప్‌ని ఇంటికి చేర్చి పరిచర్యలు చేసారు. విషయం తెలుసుకున్న ప్రతాప్ తల్లిదండ్రులు, పోలీసు బలగం తెల్లవారేసరికి ఊర్లో దిగారు.

పెద్దిరెడ్డి వారందరినీ ఇంటివద్ద కూర్చోబెట్టి వారిని సమాధానపరచి తగిన మర్యాదలు చేసాడు. మనుష్యులను నలుమూలల పంపి మరిడయ్యను తీసుకుని రమ్మనమని పురమాయించాడు. చుట్టుప్రక్కల గ్రామ ప్రజలందరూ ప్రతాప్‌ని చూడడానికి వచ్చారు..

ప్రెసిడెంట్ పంపినవారికి మరిడయ్య కొండవాగు ప్రక్క చింతలతోపులో దొరికాడు. వాడికి కలరా సోకడంతో అక్కడవాడు పీనుగులా పడి వున్నాడు. తెలివితప్పి పడివున్న వాడిని మోసుకొచ్చారు.

"ఈడికి గొట్టాలమ్మ సూపిందండి. ఈడు గడియో సిటవో కునికీసేవోడండి" అన్నారు వాడిని మోసుకొచ్చినవాళ్ళు.

డాక్టర్ ప్రతాప్ మరిడయ్యను పరీక్షించి వాడికి ఇంజెక్షన్ ఇచ్చి గ్లూకోజ్ ఎక్కించాడు. మరో గంటకి వాడు గండం నుండి బయటపడ్డాడు.

"తవరు దేవుడే బాబూ. తెలవక తవమీద సెయిచేసుకున్నా నా పేనాలు కాపాడారు. సెమించండి. బాబూ ఇన్నాళ్లూ కూటికోసం నాను ఏసం కట్టిన. నాకు మంతర తంతరాలు వైద్దం ఏటీ తెలవదు. ఈ పొద్దు నుండి అటి జోలెల్లను. తమ పాదాల సాచ్చిగ సెవతన్నాను. కూలిసేసుకు బతుకతను" అని ప్రతాప్ కాళ్ల మీద పడ్డాడు మరిడయ్య.

"ఇంతొరకూ మావందరం గుడ్డి నమ్మకాలత ఎట్టా బతకతన్నావో బోదసేసి మా కల్లు దెరిపించిన దేవుడి నాటి బాబుమీద సెయ్యి సేసుకున్నోడిని ఊరికే ఒగ్గియడమా! ఈల్లేదు ఆడికి సిచ్చపడాల" అన్నారు గ్రామ ప్రజలు రెచ్చిపోయి.

మరిడయ్య మీద కేసు బుక్‌చేసి వాడిని లాకప్‌లో వేయడానికి పోలీసులు ముందుకొచ్చారు. పెద్దిరెడ్డి ప్రతాప్ వంక చూసాడు.

"ఆగండి మరిడయ్యను మీరు ఏ నేరం మీద అరెస్ట్‌చేస్తారు?" అన్నాడు డాక్టర్ ప్రతాప్.

"అదేమిటి సార్! అతను మీమీద హత్యాప్రయత్నం చేసేడుకదా!" అన్నారు పోలీసులు.

"హత్యా ప్రయత్నమా? ఎవరు చెప్పారు మీకు? నేను మీకు అతనిమీద

ఎలాంటి రిపోర్టు ఇవ్వలేదే?" అన్నాడు ప్రతాప్.

ప్రతాప్ మాటలకు అంతా నివ్వెరపోయారు.

"అదేమిటిసార్! మీ తలకు అంత గాయమైతేను" అన్నాడు ఎస్ఐ.

"ఓ ఇదా? రాత్రి చీకట్లో కాలు స్లిప్ అయి పడ్డాను అంతే!" అన్నాడు చిర్నవ్వుతో.

ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, ప్రతాప్ తండ్రి విజయ్‌కుమార్ కృతజ్ఞతతో అతని వంకచూసారు. "నేరం చేసినవాడిని శిక్షించడం కంటే వాడిలో పశ్చాత్తాపం కలుగజేసి వాడు తిరిగి ఏ నేరం చేయకుండా చేసి వాడిని మంచి మార్గంలో నడిపించడమే గొప్ప విషయం" అన్న డాక్టర్ ప్రతాప్ సిద్ధాంతాన్ని గ్రామ ప్రజలు హర్షించారు.

('ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక', జూలై 2000) ✪